క్లుప్తంగా

భీమేశ్వరా.. సర్వేశ్వరా..

కిటకిటలాడిన పంచారామ క్షేత్రం



సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పిల్లలకు వేసవి సెలవులు కావడంతో వేలాది మంది ఇతర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారున తొలి అభిషేకం, పూజలను పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి నీరు, పాలతో అభిషేకాలు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు, ఉప ఆలయాల్లో ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. స్వామివారికి నైవేద్యం అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో మజ్జిగ పంపిణీని కొనసాగించారు.

అపర్ణాదేవిని దర్శించిన దేవదాయ శాఖ కమిషనర్



అపర్ణాదేవి అమ్మవారిని దర్శించుకున్న కమిషనర్ సత్యనారాయణ

గొల్లప్రోలు: మండలంలోని తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి అమ్మవారిని సోమవారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, స్వర్ణశ్రీ దంపతులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యనారాయణ, స్వర్ణశ్రీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితులు వారికి ఆలయ విశిష్టతను వివరించి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం వేసవి శిక్షణ తరగతులు



వేసవి శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న పాలంకి నాగరాజు

పెద్దాపురం: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వచ్చే నెల 11వ తేదీ వరకూ నిర్వహించే తరగతుల్లో భాగంగా సోమవారం శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి సంతాపం

సామర్లకోట: స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కారిపల్లి భాగ్యరాజ్ (58) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతూ పెన్షన్‌లైన్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. భాగ్యరాజ్ మృతికి పలువురు కాంగ్రెస్, ఎస్సీ సంఘ నాయకులు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏబీఎన్‌డీఎస్ ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని బళ్లమార్కెట్, విఘ్నేశ్వరా థియేటర్, వీర్రాఘవపురం ఏరియాలకు సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

కుట్టిందో మటాష్..!

- డెంగీపై వైద్య సిబ్బంది అప్రమత్తం
- గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు
- దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచన



గొల్లప్రోలు మండలంలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. అపరిశుభ్రత, ఇళ్ల వద్ద మురికి నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తి చెంది పలు రకాల వ్యాధులకు కేంద్ర బిందువుగా మారుతుంటాయి. వాటిలో అత్యంత ప్రమాకరమైన డెంగీ వ్యాధి ప్రస్తుత వేసవిలో ఎక్కువగా ప్రబలే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల బాట పట్టారు. టైగర్ దోమ, పులి చార దోమతో జర జాగ్రత్తగా ఉండాలని వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ డెంగీ నివారణా దినోత్సవం సందర్భంగా గత వారం రోజులుగా డెంగీ వ్యాప్తిపై వైద్య సిబ్బంది ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మండుటెండలో గ్రామాల్లో తిరుగుతున్న వైద్య సిబ్బంది డెంగీ దోమ వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

డెంగీ లక్షణాలు

టైగర్, పులిచార దోమలు నీరు నిల్వ ఉన్న చోట్ల గుడ్లు పెడతాయి. డెంగీ హెమరేజిక్ ఫీవర్, డెంగీ హెమరేజిక్ షాక్ సిండ్రోమ్ అనే ప్రమాదకరమైన జ్వరాలు ఈ దోమలు కుట్టడం వల్ల సంభవిస్తాయి. ఈ వ్యాధి సోకినప్పుడు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకలు, కండరాల్లో భయంకరమైన నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు వికారంతో కూడిన మల విసర్జన, వివిధ శరీర బాగాల్లో రక్తస్రావం వంటివి కనిపిస్తాయి.

ఎలా వ్యాపిస్తుందంటే...

ఈ వ్యాధి సూక్ష్మ వైరస్, ఎడిస్ దోమ, చిన్నగా నల్లని చారలు కలిగిన దోమలు (టైగర్ దోమలు) కుట్టడం వలన వ్యాప్తి చెందుతుంది. ఇళ్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే ఈ దోమలు వ్యాప్తి చెందుతాయి.

నివారణా చర్యలు ఇలా..

- దోమ తెరలు వాడడం
- ఇంటి కిటికీలకు తలుపులకు జాలీలు వాడడం
- ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం
- నీటి తొట్టిలను శుభ్రం చేసుకోవడం
- నీరు నిల్వ ఉండే ఖాళీ డబ్బాలు, కొబ్బరి చెక్కలు వంటివి ఇళ్ల మధ్య లేకుండా జాగ్రత్త పడడం
- వాటర్ బాటిల్స్, వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం,
- పూల కుండీలు, ఎయిర్ కూలర్లలో ఎప్పటికప్పుడు నీరు మార్చుకోవడం
- దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, మందులు పిచికారీ చేయడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా నివారించవచ్చు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

డెంగీ వ్యాధి చాలా ప్రమాదకరం. ఈ వ్యాప్తి చెందకుండా నివారణా చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలిస్తున్నాం. దోమలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉంటే వాటిని శుభ్రం చేయించి తగిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. గ్రామాల్లో రచ్చబండల వద్ద ప్రజలకు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. డెంగీ వ్యాధి సోకితే కలిగే నష్టాలు, ప్రమాదాన్ని ముందుగానే ప్రజలకు వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్నాం. గత వారం రోజులుగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– అహ్మద్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు మండలం

ఈ దోమలు పగలు, రాత్రి ఎప్పుడైనా కుడతాయి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్ష (ఎన్‌ఐవీ) చేయించుకోవాలి. ఈ వ్యాధి నివారణకు చికిత్స లేదు కాని లక్షణాలు బట్టి వైద్య సేవల ద్వారా తగ్గించే అవకాశాలు ఉన్నాయి. ఈ వ్యాధి సోకితే వెంటనే చికిత్స చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం.



డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు



స్వామినాయుడు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పలు చోట్ల ఘర్షణలు, అల్లర్లు జరిగిన నేపథ్యంలో ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు విధించినట్టు స్థానిక ఎస్సై స్వామినాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కొండెవరం, ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి, శ్రీరాంపురం బీచ్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకుల్లో ఖాళీ బాటిల్స్, డబ్బాల్లో పెట్రోలు కొట్టవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసుల సూచనలు తూ.చా. తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పెట్రోల్ బంకుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోని కిరాణా షాపుల వద్ద పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేయరాదన్నారు. నిబంధనలను అతిక్రమించి గ్రామాల్లో ఎవరైనా బాటిళ్లు, డబ్బాల్లో పెట్రోల్ విక్రయిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బంకుల యజమానులతో పాటు కిరాణా షాపుల యజమానులు నిబంధనలు పాటించాలని సూచించారు.

పల్లె బాట పట్టిన అధ్యాపకులు



దుర్గాడలో విద్యార్థి తల్లిదండ్రులకు కరపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు

గొల్లప్రోలు: అత్యుత్తమ బోధన, ఆధునిక వసతులు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే మీ పిల్లలను చేర్పించాలంటూ చేబ్రోలు జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం పల్లె బాట పట్టారు. పలు గ్రామాల్లో టెన్త్ పాసైన విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్ వంటి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ దీటుకు దీటుగా విద్యాబోధన జరుగుతోందని వివరించారు. దుర్గాడ, ఎ.విజయనగరం, మల్లవరం, తాటిపర్తి గ్రామాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఒకసారి తమ కళాశాలను సందర్శించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తమ కళాశాలలో ఉన్న వసతులు, ప్రయోజనాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 15 నుంచి అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. టెన్త్ పాసైన విద్యార్థులు తమ మార్క్స్ మెమో, ఆధార్, ఇతర ధ్రువపత్రాలను తీసుకొచ్చి అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ ప్రకాష్ సూచించారు.

దృఢ సంకల్పంతో సాగితే విజయం



హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు



శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరంలో భాగంగా సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఐడీఎస్ఎస్‌సీ 2024కు ఎంపికైన క్యాడెట్ల శిక్షణ శిబిరంలో భాగంగా పెద్దాపురంలో ప్రముఖ గైనకాలజిస్ట్ విజయలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్, కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దృఢసంకల్పం, ఆత్మ విశ్వాసంతో సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చన్నారు. ఎన్‌సీసీతో మంచి భవిష్యత్తు ఉంటుదన్నారు. క్యాడెట్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సురక్షిత జీవనాన్ని సాగించాలని అన్నారు. ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఠాపురం ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కాకినాడ జేఎన్టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి అక్కడ భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనధికారికంగా మట్టి తరలిస్తే చర్యలు

కరప: మండలంలో ఎవరైనా అనధికారికంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు హెచ్చరించారు. పెద్దాపురప్పాడు, యండమూరు గ్రామాల్లో మళ్లల్లోంచి మట్టి తరలిస్తున్నట్టు సోమవారం ఫిర్యాదు అందడంతో ఆర్‌ఐ పేపకాయల మాచర్రావుతో కలసి తహసీల్దార్ రామకోటేశ్వరరావు, పోలీసులు దాడులు చేశారు. యండమూరు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తుండగా 7 ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్ఐ టి.రామకృష్ణ, పోలీసుల సహాయంతో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను కరప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులతో తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల పొలాల్లో మెరక, పల్లాలు తీసుకోవడానికి ముందుగా అర్జీ పెట్టుకోవాలని, అనుమతులు ఇచ్చిన తర్వాతే మట్టి తవ్వకాలు చేపట్టాలన్నారు. అనధికారికంగా మట్టిని తరలిస్తున్న కారణంగా సదరు 7 ట్రాక్టర్లకు ఒక్కొక్కదానికి రూ 3 వేల చొప్పున అపరాధ రుసుం వసూలు చేసి, ట్రాక్టర్లను వదిలేశారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

కరప: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలవ్వగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగబాబు టైల్స్ పనిచేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం నాగబాబు కరప వచ్చి పని ముగించుకుని మోటార్ సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా పెనుగుదురు వంతెన దిగువన ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగబాబు తలకు తీవ్ర గాయమైంది. అతన్ని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు తల్లి మేడిశెట్టి లక్ష్మీనరసమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఎస్ఐ టి.రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

చూడండి సారూ... సమస్యల తీరు

- రోడ్డు మార్జిన్లలో తుప్పలు, గుర్రపు డెక్క
- ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోక ఇబ్బందులు



హుస్సేన్‌పురం వద్ద రోడ్డు మార్జిన్‌లో గుర్రపుడెక్క గుట్టలు

సామర్లకోట: పర్యవేక్షణ లేకుంటే.. పట్టించుకునే అధికారి కానరాకుంటే.. ఇలానే ఉంటోంది. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న పనులనూ పట్టించుకోక పోవడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్లకు ఇరువైపులా తుప్పలు పెరిగినా, రహదారి మార్జిన్లలో మట్టి పేరుకుపోయినా ఎవరూ స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు. సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డు సమీపం నుంచి కాకినాడ రోడ్డు వద్ద కల్వర్టు ఉంది. దీనిపై వర్షపు నీరు గోదావరి కాలువలోకి పోవడానికి రంధ్రాలు ఏర్పాటు చేశారు. తరచూ వర్షాలు పడడం, ట్రాఫిక్ కారణంగా ఆ రంధ్రాలు మట్టితో మూసుకుపోయాయి. దాంతో రైల్వే గూడ్స్ యార్డు వద్ద ఉన్న కల్వర్టుపై నీరు నిలిచి చిన్నపాటి వర్షానికీ చెరువుగా మారుతోంది. ఈ రంధ్రాల వద్ద శుభ్రం చేయించపోవడంతో నీరు నిలిచిన సందర్భాల్లో వాహనదారులపై అది చిమ్ముతుంది. నీరు ఇలానే నిలిచి ఉంటే రోడ్డు పాడయ్యే ప్రమాదం ఉంది. వాహన రాకపోకల కారణంగా మరింత ఛిద్రమవుతుంది. ఈ కల్వర్టుపై రోడ్డు రైల్వే ట్రాక్ వైపు కిందకు దిగిపోయింది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాలు ప్రారంభం కావడంతో రోడ్ల పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలు వచ్చిన సమయంలో రైల్వే గూడ్స్ యార్డు కల్వర్టుపై మట్టిని వారానికి ఒకసారి తొలగించే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మాది కాదంటే, మాది కాదు

హుస్సేన్‌పురం సమీపంలో రోడ్డు మార్జిన్‌లో గుర్రపు డెక్కను గుట్టలుగా పోశారు. రెండు నెలల కిందట గోదావరి కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్కను ఇరిగేషన్ అధికారులు తొలగించారు. దానిని రోడ్డు పక్కనే వదిలేశారు. అది గుట్టలుగా కనిపిస్తోంది. ఆ గుట్టలను ఆర్‌అండ్‌బీ అధికారులే తొలగించాలని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో మార్జిన్‌లో గుర్రపుడెక్క చిందరవందరగా కనిపిస్తోంది. మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. దీనివల్ల తొలగించిన ఈ గుర్రపుడెక్క తిరిగి కాలువలోకి చేరడమో, రోడ్డుపైకి వచ్చి నిలిచిపోవడమో జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. సామర్లకోట నుంచి వేట్లపాలెం వరకూ కెనాల్ రోడ్డులో పలుచోట్ల మార్జిన్‌లలో తుప్పలు పేరుకుపోయాయి. ఈ రోడ్డులో ప్రయాణించేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కెనాల్ రోడ్డులో సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపై తుప్పలు మరింత రోడ్డుపైకి వచ్చాయి. ఈ సమస్యనూ పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కెనాల్ రోడ్డు పక్కన సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ సమీపాన పెరిగిన తుప్పలు



సామర్లకోట రైల్వే యార్డు సమీపంలో మూసుకుపోయిన కల్వర్టు రంధ్రాలు

సంబరాలకు సిద్ధం కండి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు



పిఠాపురంలో నాయకులతో మాట్లాడుతున్న వంగా గీత

పిఠాపురం: నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీ గెలుపును ఎప్పుడో నిర్ణయించేశారు.. ఇక ఫలితాలు రావడమే తరువాయి విజయోత్సవ సంబరాలకు సిద్ధం కండి అని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా ఆమె పిఠాపురం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ గ్రామాల్లో పోలింగ్ సరళిపై ఆయా గ్రామాల నాయకులతో చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురంలో ఒక కుటుంబ సభ్యురాలిగా స్థానిక ప్రజలందరూ తనపై ఎనలేని అభిమానం చూపి ఎన్నికల్లో గెలిపిస్తున్నారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాదరణే తన గెలుపును తెలియజేస్తోందన్నారు. ప్రజలందరూ తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు. ఇప్పటికే పిఠాపురంలో ఎంతో అభివృద్ధి చేశానని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పిఠాపురాన్ని రాష్ట్రంలో ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సీఎం వైఎస్‌జగన్ పూర్తి సహకారం అందిస్తారని, ఆయన ఇప్పటికే తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తానని ప్రకటించడమే ఇందుకు నిదర్శమన్నారు. కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



సామర్లకోట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

సామర్లకోట: నియోజకవర్గంలోని అనేక పరిశ్రమలు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని, అటువంటి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని పట్టణ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అన్యాయంగా విధుల నుంచి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకొనే విధంగా యాజమాన్యంతో చర్చించి న్యాయం చేయాలని కార్మిక సంఘ నాయకులు కోరారు.

రేపటి నుంచి శ్యామలాంబ జాతర

సామర్లకోట: మండలంలోని అచ్చంపేట గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్యామలాంబ జాతర ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజు జాతరను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక ప్రదర్శనతో ఉత్సవం జరుగుతుందన్నారు. 23న ఆలయం వద్ద తిరునాళ్ల జరుగుతాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెద్దాపురం: వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సాయంత్రం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎటువంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రశాంత కౌంటింగ్ ప్రక్రియకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్సై సురేష్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి పూజలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 24న సదస్య మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ రాజేశ్వరరావు తెలిపారు.